క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, కోట వంశీ, చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే నెహ్రూకు వినతిపత్రం సమర్పిస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

జగ్గంపేట: తమ సమస్యలు పరిష్కరించాలని డ్వాక్రా యానిమేటర్లు కోరారు. ఈ మేరకు ఆదివారం జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి వినతి పత్రం సమర్పించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి సర్కులర్ తొలగించాలని, రూ.10 లక్షల వరకూ గ్రూపు ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని, పాత బకాయిలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ప్రభుత్వంతో చర్చించి యానిమేటర్లకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ముగిసిన సత్యనారాయణ వ్రతం



మైసూరు అవదూత దత్తమణి ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యదేవుని మహావ్రతం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో రెండు రోజులుగా మైసూరుకు చెందిన అవదూత దత్తమణి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతం ఆదివారంతో ముగిసింది. దేవదాయశాఖ కమిషనర్ అనుమతితో రెండు రోజుల పాటు వ్రతం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం 333 అడుగుల విస్తీర్ణంలో మహా నారాయణ యంత్రాన్ని ఏర్పాటు చేసి దానిపై బీజాక్షరాలు లిఖించారు. 116 మంది రుత్విక్కులు కార్యక్రమం నిర్వహించగా వంద జంటలు పాల్గొన్నాయని తెలిపారు. వ్రతం ముగియడంతో భక్తులకు నాలుగు వేల ప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేశారు.



కొండ కాలువలు పొంగడంతో పంపాకు తరలివస్తున్న వర్షపు నీరు



ఏలేశ్వరంలో నీట మునిగిన ఎంపీపీ స్కూల్ ప్రాంగణం



దానవాయిపేట తీరంలో ఎగసి పడుతున్న అలలు

వీడని వాన

- మూడోరోజూ ఎడతెరిపి లేకుండా వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో కొద్దిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం వరుసగా మూడోరోజు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ రోజంతా వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రధాన రహదారులు నీటమునిగాయి. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. వర్షానికి జనం రాకపోకలు స్తంభించాయి. గ్రామాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండిపోవడం, బురదమయంగా మారడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని పలు కాలనీల్లో రహదారులపై వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. పంట పొలాలను వర్షపునీరు ముంచెత్తింది. వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాండవలో పెరుగుతున్న నీటిమట్టం

కోటనందూరు: అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తాండవ జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. మూడు రోజుల క్రితానికి 364.2 (2 టీఎంసీ) అడుగులు ఉన్న నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 367.2 (2.4 టీఎంసీ)అడుగులకు చేరింది. వర్షం తగ్గుముఖం పట్టడంతో కేవలం 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తుందని తాండవ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు డీఈఈ పి.అనురాధ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు జలాశయాన్ని పరిశీలించారు. వర్షాలతో ప్రాజెక్టుకు ఎటువంటి ప్రమాదం లేదని డీఈఈ అనురాధ తెలిపారు.

విస్తారంగా వర్షాలు

శంఖవరం: అల్పపీడనం ప్రభావంతో మండలవ్యాప్తంగా మూడురోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాల్లో వరినాడు మడులు నీట మునిగాయి. శంఖవరం, కత్తిపూడి, కొతంగి గ్రామాల్లో చెరువులు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. సిద్దవారిచెరువు నీరు దిగువ ప్రాంతాలకు పోటెత్తడంతో పొలాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లపై నీరు ఉధృతంగా ప్రవహించింది.

పంపాలో 95 అడుగులకు చేరిన నీటిమట్టం

అన్నవరం: స్థానిక పంపా రిజర్వాయర్‌కు వరద ఉధృతి అంతకంతకు పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం సాయంత్రం 93 అడుగులు ఉన్న నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి రెండు అడుగులు పెరిగి 95 అడుగులకు చేరుకుంది. సోమవారం ఉదయానికి మరో అడుగు పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పంపా క్యాచ్‌మెంట్ ఏరియాలోని రౌతులపూడి ఏజెన్సీలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండ వాగులు పొంగడంతో ఆ నీరంతా అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌కు చేరుతోంది. ఏలేరు ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు నీరు సరఫరా అవుతున్న విషయం తెలిసిందే. అత్యవసర పరిస్థితిలో ఆ కాలువ నుంచి పంపా రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసేందుకు గాను రౌతులపూడి మండలం శృంగవరం వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ స్లూయిజ్ నుంచి పంపాకు నీరు విడుదల చేయడంతో ఆ నీరు కూడా పంపాకు చేరుతోంది. ఫలితంగా పంపా రిజర్వాయర్ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది.

ఆయకట్టుకు నేడు నీటి విడుదల

పంపా రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సోమవారం నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పంపా నీటిమట్టం 95 అడుగులకు చేరడంతో రైతుల నుంచి వచ్చిన ఒత్తిడిమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

అల్లకల్లోలంగా సముద్రం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. మండలంలోని సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. వాయుగుండం ప్రభావంతో కోనతీర ప్రాంతంతో పాటు మెట్ట, పల్లపు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్ని గ్రామాల్లోనూ పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈదురు గాలులు, వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



శంఖవరం మండలం అచ్చంపేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



తాండవ రిజర్వాయర్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న డీఈఈ అనురాధ, ఇంజనీర్లు



వరద నీటితో కళకళలాడుతున్న పంపా రిజర్వాయర్

యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

తుని రూరల్: అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉద్యాన తోటలు, కూరగాయల సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని హార్టికల్చర్ ఆఫీసర్ జి.విజయలక్ష్మి సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజులుగా మండల వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని తేటగుంట, రాజులకొత్తూరు తదితర గ్రామాల్లో ఆదివారం హెచ్‌ఓ విజయలక్ష్మి పర్యటించారు. పాక్షికంగా దెబ్బతిన్న కూరగాయలు, పూలు, అరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలకు గురైన తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. అరటిలో తడి ఆరిన తర్వాత వంద గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్‌ను 20–25 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు దఫాలుగా వేయాలన్నారు. దుంప కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి దుంప చుట్టూ తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కూరగాయల పంటల్లో వర్షాలు తగ్గిన వెంటనే అంతర సేద్యం చేయాలన్నారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలు వేయాలన్నారు. మొక్కలకు ఊత ఇవ్వడం, పందిళ్లపై తీగజాతి కూరగాయలను సాగు చేయడం వంటివి చేపట్టాలన్నారు. కొత్తగా నాటిన మామిడి, బొప్పాయి మొక్కలు రెండు, మూడు అడుగులు ఎత్తు ఉంటే కర్రలను ఊతగా నిలబెట్టాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. అధిక వర్షాలకు కోతకు గురైన నేల సారం తగ్గుతుందని, అధికారులు సిఫార్సు చేసిన ఎరువులను ఐదు నుంచి పది శాతం మోతాదు ఎక్కువగా వాడాలని సూచించారు.

పి.ఇ.చిన్నాయపాలెం రైల్వే గేటు మూసివేత

తొండంగి: రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెం రైల్వే గేటును ఈ నెల 24వ తేదీ వరకూ మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం గేటును మూసివేశారు. కొద్దిరోజుల క్రితం గోపాలపట్నం రైల్వే గేటు మూసివేయడంతో ఆ మార్గంలో వెళ్లే వారంతా పి.ఇ.చిన్నాయపాలెం గేటు ద్వారా రాకపోకలు సాగించారు. కాగా ఇప్పుడు చిన్నాయపాలెం రైల్వే గేటు మూతపడటంతో గ్రామస్తులు ఎ.కొత్తపల్లి, గోపాలపట్నం రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. రైల్వే గేటు తెరిచే వరకూ తాత్కాలికంగా వాహనదారులకు ఇబ్బందులు తప్పవు.

శాకంబరీదేవి నమోస్తుతే...

- కూరగాయలు, పండ్లతో విశేష అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఎస్.అన్నవరంలో శాకంబరిగా నల్గొండమ్మ తల్లి



తునిలో శాకంబరిగా దర్శనమిస్తున్న వర మహాలక్ష్మి అమ్మవారు



గోపాలపట్నంలో శాకాంబరిగా నేరేళ్లమ్మ అమ్మవారు



రత్నగిరిపై శాకంబరి అలంకరణలో కనక దుర్గమ్మవారు

అన్నవరం: ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రత్నగిరి దుర్గామాతలు వన దుర్గ, కనకదుర్గ అమ్మవార్లు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యం స్వర్ణాభరణాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా భక్తులకు దర్శనమిచ్చే అమ్మవార్లకు పండితులు పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. ఉదయం 6 గంటల నుంచే శాకంబరి అలంకరణలో అమ్మవార్ల దర్శనాలకు భక్తులు పోటెత్తారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తదితరులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. భక్తులకు కదంబం ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అలాగే అన్నవరం గ్రామదేవత నేరేళ్లమ్మతల్లి శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎస్.అన్నవరంలో నల్గొండమ్మతల్లికి..

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు వేంపాడు మెట్ట వద్ద కొలువైన నల్గొండమ్మ తల్లికి ఆదివారం కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి పలు రకాల కూరగాయలు, పండ్లతో విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఎస్.అన్నవరం, తుని, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు.

శాకంబరిగా వరమహాలక్ష్మి అమ్మవారు

తుని: గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక చిట్టూరి మెట్రో ప్రాంగణంలో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు అమ్మవారికి కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జగ్గంపేటలో సర్వకామాదాంబ అమ్మవారికి...

జగ్గంపేట: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆదివారం జగ్గంపేట శివాలయంలో సర్వకామాదాంబ అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం గ్రామదేవత నేరేళ్లమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి..

గోకవరం: స్థానిక బత్తులవారి వీధిలో వేంచేసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, పండ్లతో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లోవకు వర్షం ఎఫెక్ట్

- తలుపులమ్మ దర్శనానికి తగ్గిన భక్తులు
- అమ్మవారికి రూ.4.99 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో మహాచండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

తుని రూరల్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు లోవ దేవస్థానికి వచ్చే భక్తులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు భారీగా తగ్గిపోయారు. ఆషాఢమాసంలో మొదట ఆదివారం 30 వేలు, రెండో ఆదివారం 40 వేల మంది భక్తులు వచ్చారు. ఆదాయం సైతం వరుసగా రూ.10 లక్షలు, రూ.11 లక్షలు వచ్చింది. ఈ వారం మరింత ఎక్కువ మంది భక్తులు వస్తారని, ఆదాయం పెరుగుతుందని అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా వర్షం కారణంగా భక్తుల తాకిడి తగ్గింది. ఆదివారం తలుపులమ్మవారని 15 వేల మంది భక్తులు దర్శించుకోగా ఆదాయం రూ.4.99 లక్షలు వచ్చినట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దీంతో రెండొంతులు భక్తులు, సగానికిపైగా ఆదాయం తగ్గినట్టయ్యింది. లోవలో అమ్మకానికి ఉంచిన పులిహోర ప్రసాదం మిగిలిపోయింది. పులిహోర ప్రసాదం పాడయ్యే అవకాశం ఉండడంతో వచ్చిన భక్తులకే ఉచితంగా అందించామని ఈఓ తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.1,99,060, పూజా టికెట్లకు రూ.92,680, కేశఖండనశాలకు రూ.14 వేలు, వాహన పూజలకు రూ.1900, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.1,08,092, విరాళాలు రూ.83,595 వెరసి మొత్తం రూ.4,99,327 ఆదాయం లభించినట్టు ఈఓ తెలిపారు.

సత్యదేవుని ప్రసాదాలకు పోటెత్తిన భక్తులు



నమూనా ఆలయం వద్ద ప్రసాదం కొనుగోలు చేసేందుకు క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రసాదం విక్రయాలు ఆదివారం రికార్డు స్థాయిలో జరిగాయి. సుమారు 70 వేల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించడం ద్వారా రూ.14 లక్షలు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. ఆషాఢమాసంలో ప్రతి ఆదివారం ఉదయం తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు ఉభయగోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తుని మండలం లోవ దేవస్థానికి వస్తున్న విషయం తెలిసిందే. వారంతా తిరుగు ప్రయాణంలో అన్నవరంలో ఆగి సత్యదేవుని ప్రసాదాలు కొనుగోలు చేస్తారు. దీనిలో భాగంగా ఆదివారం లోవ దేవస్థానానికి వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో అన్నవరంలోని తొలిపావంచా వద్ద గల ప్రసాదం కౌంటర్, జాతీయ రహదారిపై పాత నమూనా ఆలయం, కొత్త నమూనా ఆలయాల వద్ద ప్రసాదం కౌంటర్లలో ప్రసాదాలు కొనుగోలు చేశారు. తొలిపాంచా వద్ద గల ప్రసాదం కౌంటర్‌తో పాటు అదనంగా మరో రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై గల నమూనా ఆలయాల వద్ద కూడా మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ప్రసాదాల కొనుగోలు కోసం భక్తులు భారీగా క్యూల్లో వేచి ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రద్దీ కొనసాగింది.

వర్షంతో ఇక్కట్లు

సత్యదేవుని పాత నమూనా ఆలయం వద్ద ప్రసాదం కొనుగోలు చేయడానికి వచ్చిన భక్తులు వర్షం కారణంగా ఇబ్బంది పడ్డారు. ఒకవైపు వర్షానికి తడవడంతో పాటు నమూనా ఆలయం ముందు నేల బురదతో నిండిపోవడంతో నిల్చోవడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది.

పదోన్నతి పొందిన దొరబాబుకు సత్కారం

గోకవరం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన అధ్యాపకుడు చిక్కం దొరబాబును రంపయర్రంపాలెం గ్రామ ఉద్యోగుల సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన దొరబాబు రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ పదోన్నతిపై సీతానగరం జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. దీంతో గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల రాజు, సభ్యులు కోరాటి అప్పన్నబాబు, తిరుపతి రాము, పెరవలి బాబూరావు తదితరులు ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాకర విష్ణు, పాటి రాజా, చిక్కం సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలు గ్రామాల్లో అన్నదానాలు

ఏలేశ్వరం: గురుపౌర్ణమి వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. పట్టణంలోని సాయిబాబా మెట్టపై గల బాబా ఆలయంలో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పండితులు బాబా వారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సిరిపురంలో మనం ట్రస్టు చైర్‌పర్సన్ మానూరి లతాగంగరాజు బాబావారికి నక్షత్ర హారతి సమర్పించారు. కార్యక్రమంలో ప్రణీత్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

తపోవనంలో ఘనంగా వ్యాసపూజ

తుని రూరల్: వ్యాస పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో ఆదివారం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. వేదపండితులు, వేద విద్యార్థులు వ్యాస భగవానుడికి ప్రత్యేక పూజలు, హోమం చేశారు. సుభద్రయ్యమ్మపేటలోని పంచముఖ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్.అన్నవరం, తేటగుంట, మరువాడ, వి.కొత్తూరు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లోనూ గురు పూజోత్సవాలు నిర్వహించారు.



ప్రత్తిపాడు సత్యసాయి సేవా సదన్‌లో తండులార్చన

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గండేపల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో సనాతన గురువైన వేద వ్యాసుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పండితులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని ఉప్పలపాడు, మల్లేపల్లి, నాయకంపల్లి, తాళ్లూరు గ్రామాల్లోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సాయిబాబాకు విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గురువులకు సత్కారం

అన్నవరం: హిందూ సంస్కృతిలో గురువులకు విశిష్ట స్థానం ఉందని అన్నవరం దేవస్థానం వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక సత్యగాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నవరం దేవస్థానం మహా విద్యాపారాయణదారుడు బ్రహ్మశ్రీ ఓరుగంటి ఫణీంద్రశర్మ, విశ్రాంత హెచ్ఎం మైలవరపు సత్యనారాయణమూర్తి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కందర్ప శ్రీరామచంద్రమూర్తిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డీవీజే రమణమూర్తి, కార్యదర్శి కె.చిరంజీవి, ఆర్ఐ ప్రసాద్, అర్చకుడు సుదీర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో గురువులను సన్మానించిన బ్రాహ్మణ సంఘం సభ్యులు

జ్ఞానాన్ని అందించేవాడే గురువు

గోకవరం: మనలో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని అందించేవాడే నిజమైన గురువని విశ్వహిందూ పరిషత్ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు అన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో ఆయన ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు, పురోహితులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వివిధ రంగాల్లో అత్యున్నత స్థానంలో ఉన్నవారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద దాసరి తమ్మన్నదొర, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ పాల్గొన్నారు.



గోకవరంలో వేదపండితుడు కవికిరణ్‌శర్మను సత్కరిస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు

ఘనంగా తండులార్చన

ప్రత్తిపాడు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక సత్యసాయి సేవా సదన్‌లో తండులార్చన నిర్వహించారు. పండితులు సత్యసాయి నాథునికి విశేష పూజలు, పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ గురువు తణుకు అప్పల ధర్మ సూర్యకుమార్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. సత్యసాయిబాబా జగద్గురువుగా అవతరించారని తెలిపారు. అనంతరం సూర్యకుమార్‌ను సత్యసాయి సేవా సమితి సభ్యులు శాలువాతో సత్కరించారు. సేవా సదన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. దాతల సహకారంతో పేదలకు ఆహార పొట్లాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా విద్యాజ్యోతి కన్వీనర్, ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం సంక్షేమాధికారి జె. సాయి సూర్యలక్ష్మి, కిర్లంపూడి జోన్ కన్వీనర్ కొమ్ముల జయబాబు, సమితి కన్వీనర్ సూర్యనారాయణ, ఎం. లక్ష్మణ్ కుమార్, సీనియర్ న్యాయవాది కొల్లా వీర్రాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చందనోత్సవం



శ్రీవారి ఉత్సవ మూర్తులతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి (శ్రీవారి)కి ఆదివారం వైభవంగా చందనోత్సవం నిర్వహించారు. పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి చందనోత్సవం, విశేష పూజలు నిర్వహించారు. వందలాది మంది స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గిరిప్రదక్షణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.